అనాథ వృద్ధులకు బాసటగా నిలిచిన స్వామి వివేకానంద సంస్థ

ఆశ్రయం కల్పించి.. ఆరోగ్య పరిరక్షణకు కృషి

అయిన వారు కాదన్నా.. అక్కున చేర్చుకుని సేవలు



సంస్థ ఏర్పాటుకు ఎనలేని కృషి చేసిన మాతృమూర్తిని సత్కరిస్తున్న ప్రముఖులు (ఫైల్)



మహానేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్ (ఫైల్)

అమ్మలా లాలిస్తూ..

పాతనగరంలో గల స్వామి వివేకానంద సంస్థ ఏర్పడి పదకొండేళ్లయింది. 2014 ఫిబ్రవరి 18న రామకృష్ణ పరమహంస జయంతి సందర్భంగా వివేకానంద వృద్ధాశ్రమాన్ని ప్రారంభించారు. ఒక వృద్ధురాలిని కొంత మంది స్థానికులు తీసుకొచ్చి, ఆమెకు ఆశ్రమం కల్పించమని కోరారు. కుమారుడు, కోడలు రోడ్డుపై వదిలి వెళ్లిపోయారని చెప్పడంతో వెంటనే ఆ వృద్ధురాలికి ఆశ్రయం కల్పించారు. అప్పట్లో సంస్థ అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించేది.

డాబాగార్డెన్స్: పిల్లలుండీ కొంత మంది తల్లిదండ్రులు (వృద్ధులు) రోడ్డున పడడాన్ని జీర్ణించుకోలేక అటువంటి వారిని ఆదుకోవాలన్న సత్సంకల్పంతో స్వామి వివేకానంద వృద్ధాశ్రమాన్ని స్థాపించారు. ప్రారంభంలో ఆరుగురితో ప్రారంభమైన ఈ సంస్థ ప్రస్తుతం 15 మంది వృద్ధులకు అన్నీ తానై సేవలందిస్తోంది. మధ్యలో చాలా మంది (వరలక్ష్మి, ధర్మాపు చిన్నమ్మలు, అప్పయ్యమ్మ, ముసలిగంటి అప్పల నరసమ్మ, శీలా అప్పయ్యమ్మ, భారతమ్మ, ఒక వృద్ధుడు) కాలం చేశారు. వారు చనిపోయినప్పుడు బంధువులకు సమాచారమిచ్చినా ఎవరూ రాకపోవడంతో సంస్థ ఆధ్వర్యంలోనే అంత్యక్రియలు జరిపారు. అప్పటి ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్, సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ చనిపోయిన వారి పాడె మోసి దహన సంస్కారాలు నిర్వహించడం విశేషం. వీరందరికీ పిండ ప్రదానం కాశీలో నిర్వహించారు.



డ్రాయింగ్ పోటీల సందర్భంగా తాము వేసిన చిత్రాలతో విద్యార్థులు (ఫైల్)



వృద్ధులకు పాదపూజ చేస్తున్న శ్రీవత్సవ్ (ఫైల్)

సకల సౌకర్యాలు..

ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులందరికీ ఉదయం టీ, టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం ఫలహారం, టీ, రాత్రి భోజనం అందిస్తున్నారు. ప్రతి నెలా బీపీ, షుగర్ పరీక్షలు చేయించి మందులు ఇప్పిస్తున్నారు. వారికి అనారోగ్యం వస్తే ఏఎస్ బీచ్ హాస్పటల్ వైద్యుడు డాక్టర్ జహీర్ అహ్మద్ ఉచితంగా వైద్యం అందిస్తున్నారు.

తీర్థ యాత్రలు..

పలువురు దాతల సహకారంతో వృద్ధులందర్నీ తీర్థయాత్రలకు తీసుకెళ్తున్నారు. కాశీ, రామేశ్వరం, గయా, ప్రయాగ, కోల్‌కతా, కన్యాకుమారి, మధుర, అరుణాచలం, శ్రీశైలం, మహానంది, తిరుపతి, విజయవాడ, సింహాచలం తదితర పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్లి వారిని ఆనందింపజేస్తున్నారు.

వచ్చిన పెన్షన్‌తో..

సంస్థలో ఉన్న వృద్ధులందరికీ పెన్షన్ వస్తోంది. ఆ డబ్బులను వారి పేరిట బ్యాంకులో జమ చేస్తున్నారు. ఆ నగదుతో వారికి బంగారు వస్తువులు కొని ప్రముఖుల చేతుల మీదుగా వారికి అందిస్తున్నారు. ఈ బంగారు వస్తువులు చూసైనా బంధువులు వస్తారన్న ఓ చిన్ని ఆశ సంస్థది.

ఉచిత ట్యూషన్ సెంటర్..

రామకృష్ణ మఠం సహకారంతో ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను బోధిస్తున్నారు. పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఉపకార వేతనాలు అందించి వారికి తోడ్పాటునందిస్తున్నారు. ప్రతి సంవత్సరం వేసవిలో భగవద్గీత అధ్యయనం, పురాణ ఇతిహాసాలపై అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నారు.

మిగులు ఆహారం సేకరణ..

విశాఖ నగర పరిధిలో నిర్వహించే శుభ కార్యాల్లో మిగిలిన ఆహారాన్ని సేకరించి నిరుపేదలు, అన్నార్తులకు ప్యాకెట్ల ద్వారా అందిస్తున్నారు. అలాగే విశాఖ ప్రభుత్వ విక్టోరియా (ఘోసా) ఆస్పత్రిలో సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న పేషెంట్ల సహాయకులకు దాతల సహకారంతో భోజనాలు అందిస్తున్నారు.

వృద్ధుల సంక్షేమమే ధ్యేయం..



సంస్థ ఏర్పాటైన నాటి నుంచి అనాథ వృద్ధుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నాం. వారికి కష్టం వచ్చిందంటే.. సంస్థకే వచ్చినట్టు భావించి జాగ్రత్తగా చూసుకుంటున్నాం. వారు సంతోషంగా ఉండాలని తీర్థయాత్రలకు తీసుకెళ్తున్నాం. మంచి సందేశాన్ని ఇచ్చే సినిమాలు చూపిస్తున్నాం. వారి ఆరోగ్యం కోసం ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం.

– సూరాడ అప్పారావు, అధ్యక్షుడు, స్వామి వివేకానంద సంస్థ.

ముస్లిం నాయకుడికి వాసుపల్లి అండ



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: ఎన్‌టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) నిలిచిపోయిన నేపథ్యంలో ఓ పేద ముస్లిం నాయకునికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. క్యాన్సర్‌తో బాధ పడుతున్న 36వ వార్డు గొడారిగోతులు ప్రాంతానికి చెందిన ముస్లిం నాయకుడు మహ్మద్ జకీమ్‌ను వాసుపల్లి శనివారం పరామర్శించి తన సొంత నిధులతో మందుల కొనుగోలుకు ఆర్థిక సాయం అందజేసి భరోసా కల్పించారు. అతను అనారోగ్యంతో మంచం పట్టినట్టు తెలుసుకుని, నేరుగా ఇంటికెళ్లి ఆర్థిక సాయం కల్పించడమే కాక భరోసా కల్పించడంపై ఆ ప్రాంత ప్రజలు వాసుపల్లికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా పేదలను ఆదుకున్నారని, నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని నిలిపివేయడంతో పేద ప్రజలంటే చంద్రబాబుకి ఎంత ప్రేమ ఉందో తెలుస్తుందన్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్/కార్పొరేట్ ఆస్పత్రులు సేవలు నిలిపేసిన విషయం తెలిసిందేనన్నారు. కేవలం 500 కోట్లు ఇస్తామని చేతులు దులుపుకోవడం చంద్రబాబు ప్రభుత్వానికి సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముజీబ్‌ఖాన్, కుందేటి సుధాకర్, లండా రమణ, సాగర్, ముత్తాబత్తుల రమేష్, భీశెట్టి ప్రసాద్, మహ్మద్ షకీల్, నాజిమ్, లియాకత్, అనీస్, ఖాసీం, ఆలీ, అజీజ్లా, రఫీ, ఆకుల శ్యాం, గిడిజాల ఉమామహేశ్వరరావు, పెనుగంటి సూర్య, అజయ్, చేపల రాజు, చింతకాయల వాసు, గనగళ్ల రామరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెంకన్నకు విశేష హారతులు



నక్షత్ర హారతి వెలుగుల్లో వేంకటేశ్వర స్వామివారు

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం 28వ పాసురం సందర్భంగా కూడారై ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వెంకన్నకు ఏకహారతి, పంచహారతులు, నక్షత్ర హారతి, కుంభ హారతులు వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా దేవస్థానం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆదివారం గోదాదేవిని పెళ్లికూతురును చేయడం, పసుపు దంచు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు.

వడ్డే ఓబన్నకు ఘన నివాళి



వడ్డే ఓబన్న చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్: భయం ఎరుగని వడ్డెర్లు, బోయలు, చెంచులతో కూడిన సంచార తెగల సైన్యాన్ని సమర్థవంతంగా నడిపించి తెల్ల సైన్యాన్ని ఊచకోత కోసి ఉరుకులు పెట్టించడంలో ముఖ్య పాత్ర పోషించిన వీరుడు వడ్డే ఓబన్న అని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. సంస్థ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో కలిసి ఓబన్నకు నివాళులర్పించారు. జోన్-2 జోనల్ కమిషనర్ ఎంవీడీ ఫణిరామ్, ఏవో అప్పలనాయుడు, ఏఈ ఆనంద్, పర్యవేక్షకుడు రియాజ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

మహారాణిపేట: వడ్డె ఓబన్న జయంతి శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఆర్‌వో భవానీశంకర్ ఓబన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో కె.ఈశ్వరరావు, డీటీలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ఓబన్నకు నివాళి అర్పిస్తున్న డీఆర్‌వో భవానీశంకర్

ప్లాస్టిక్ నిషేధానికి కృషి

అల్లిపురం: ప్లాస్టిక్ నిషేధానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో 27 వేల సే నో ప్లాస్టిక్ స్టిక్కర్లు అంటించినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాలు, వ్యాపారులు, సచివాలయాల కార్యదర్శులు, జీవీఎంసీ సిబ్బంది విస్తృత ప్రచారం చేసినట్లు తెలిపారు. జూమ్ యాప్ ద్వారా అందరికీ అవగాహన కల్పించామన్నారు. ప్రజలు ప్లాస్టిక్‌కు బదులుగా లభిస్తున్న ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

వచ్చే ఆదాయంలో కొంత అనాథాశ్రమానికి

డాబాగార్డెన్స్: ఈవెంట్ల ద్వారా వచ్చే ఆదాయంలో కొంత మొత్తాన్ని అనాథ ఆశ్రమాలకు అందజేయనున్నట్టు ఎం ఈవెంట్స్ ట్రస్ట్ నిర్వాహకురాలు జెస్సీ మెర్సీ తెలిపారు. విశాఖలో మెగా ఫ్యాషన్ ప్లాట్‌ఫామ్‌గా ఎం ఈవెంట్స్‌ను నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఈవెంట్స్‌ను విశాఖలోనే పలు నగరాల్లో కూడా నిర్వహిస్తున్నామని, అలా వచ్చే ఆదాయంలో కొంత మొత్తాన్ని అనాథ ఆశ్రయాలకు అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జగదీష్, వీ ఈవెంట్స్ అధినేత ప్రసాద్, కృష్ణ ప్రసూన, రమణ, మిసెస్ విశాఖ క్వీన్ దివ్య మచ్చ, శ్రావణి, మల్లేశ్వరి, హంప్సి, మహలక్ష్మి, సంజన, సురేఖ, మేఘన, డానియల్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు

అల్లిపురం: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వన్‌టౌన్‌లో గల శ్రీ స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్ వివేకానంద ట్యూషన్ విద్యార్థులకు 6 సైకిళ్లు అందించారు. అనంతరం మాతృమూర్తులను సత్కరించారు. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సంస్థ సభ్యులు సందీప్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో లీడర్ దినపత్రిక వ్యవస్థాపకులు వీవీ రమణమూర్తి, వివేకానంద సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, యువ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, సంస్థ అధ్యక్షుడు అప్పారావు, కొల్లి సింహాచలం, మహిళా సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న సందీప్‌రెడ్డి, రమణమూర్తి

ఆదర్శమూర్తి మాస్టర్ ఈకే



పుస్తకావిష్కరణ చేస్తున్న కులపతి బుక్ ట్రస్టు అధ్యక్షుడు రాజు తదితరులు

మహారాణిపేట: మాస్టర్ ఈకే ఆదర్శనీయులని కులపతి బుక్ ట్రస్ట్ అధ్యక్షుడు సి.హెచ్.ఎస్.ఎన్. రాజు అన్నారు. జగద్గురు పీఠం మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న 64వ మాస్టర్ సీవీవీ గురు పూజోత్సవాలలో భాగంగా శనివారం ఆంకోశ సమావేశ మందిరంలో జరిగిన మాస్టర్ ఈకే గ్రంథావిష్కరణ సభలో ఆయన ప్రసంగించారు. యోగ, వేద, హోమియోపతి, జ్యోతిషం, క్రతువిద్య, భగవద్గీత, భాగవతాది గ్రంథాలపై వందకు పైగా పుస్తకాలను మాస్టర్ ఈకే రచించారన్నారు. ఈకే ఐరోపా యాత్ర అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించగా లలితా సహస్రనామ రహస్య ప్రకాశం అనే పుస్తకాన్ని కె. రాంప్రసాద్ (మచిలీపట్నం), బుక్ ఆఫ్ రిచువల్స్‌ను కె. రవీంద్రనాథ్ (బెంగళూరు), 'తైత్తిరియోపనిషత్‌ను చింతలపాటి సత్యదేవ్ ఆవిష్కరించారు. సంస్థ కార్యదర్శి బి.ఆర్.కె. రాజు, ఉప్పలపాటి భూపాలవర్మ, పప్పు రవిశంకర్, ఎస్.వి.ఎస్. మూర్తి, కంచుపాటి జయకుమార్, ఎన్.వి. రమణకుమార్, పి. నీలిమ, గణపతి రాంప్రసాద్ జోషి, ఇంద్రగంటి కాళీప్రసాద్ పాల్గొన్నారు.

జనమంతా జగదాంబ జంక్షన్‌కే

- సంక్రాంతి నేపథ్యంలో కిక్కిరిసిన రోడ్లు
- ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్



కిక్కిరిసిన జగదాంబ జంక్షన్

డాబాగార్డెన్స్: భోగి, సంక్రాంతి పండగల సందర్భంగా జగదాంబ జంక్షన్‌లో గల సీఎంఆర్ షాపింగ్ మాల్, సీఎంఆర్ ఫ్యాషన్, తుమ్మిడి బ్రదర్స్, కేఎల్‌ఎమ్, ఎస్ఆర్ షాపింగ్ మాల్, ఆర్ఎస్ బ్రదర్స్, లక్కీ, కంచి కామాక్షి, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, కంకటాలతో పాటు డాబాగార్డెన్స్‌లో గల చెన్నై షాపింగ్ మాల్ వంటి పెద్ద షోరూంలకు కొనుగోలుదారులు క్యూ కట్టారు. వస్త్ర దుకాణాలు ఆఫర్లు ప్రకటించడంతో పెద్ద ఎత్తున వస్త్రాలు కొనుగోలు చేస్తూ కనిపించారు.

ఫుట్‌పాత్ మార్కెట్‌కు గిరాకీ..

పండగ నేపథ్యంలో పెద్ద షాపింగ్ మాల్స్‌తో పాటు ఫుట్‌పాత్ మార్కెట్ కూడా బాగానే సాగుతోంది. డాబాగార్డెన్స్, జగదాంబ జంక్షన్ నుంచి టౌన్ కొత్త రోడ్డు వరకు ఫుట్‌పాత్ వ్యాపారాల విక్రయాలు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. అలాగే పోలీస్ బ్యారెక్స్ వద్ద చిన్న పిల్లల బట్టలు బాగా అమ్ముడవుతున్నాయి.

బాబోయ్ జగదాంబ జంక్షన్..

జగదాంబ జంక్షన్‌కు వెళ్లాలంటే ముప్పుతిప్పలు పడాల్సి వస్తోంది. ఇసుక వేస్తే రాలనంతగా జనం తరలిరావడంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కేజీహెచ్, కలెక్టర్ కార్యాలయం, బీచ్‌కు పోవాలన్నా.. టర్నర్‌చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, టౌన్ కొత్తరోడ్డుకు వెళ్లాలన్నా అవస్థలు పడాల్సి వస్తోంది. జగదాంబ పరిసర ప్రాంతాల్లో ఉన్న గల్లీలన్నీ పార్కింగ్‌తో పూర్తిగా నిండాయి. మసీదు జంక్షన్, ఎల్లమ్మతోట, కేజీహెచ్ అప్‌రోడ్డు, దేవరవీధితో పాటు జగదాంబ జంక్షన్, లేపాక్షి జంక్షన్, ప్రకాశరావుపేట జంక్షన్ తదితర ప్రాంతాలన్నీ ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగ్‌తో నిండిపోయాయి. ఇక్కడున్న మల్టీ లెవల్ కార్ సౌకర్యం కొంత వరకు ఉపశమనం కల్పిస్తోంది.

వేడుకగా రంగవల్లుల పోటీ



ముగ్గుల పోటీలను పర్యవేక్షిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రేమసమాజం అధ్యక్షుడు శివాజీ



ముగ్గులు వేస్తున్న నర్సులు

అల్లిపురం: ప్రేమ సమాజం ఆవరణలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యదర్శి కె. శ్రీహరి మోహన్‌రావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగు రంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా కేకేఎం లక్ష్మి, పద్మజ, విదుషి జైన్ వ్యవహరించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రేమసమాజం అధ్యక్షుడు బుద్ధ శివాజీ అందజేశారు. కోశాధికారి ఎంవీవీకే గుప్త, కార్యవర్గ సభ్యులు పి.గణపతిరావు, శరగడం సత్యనారాయణ, ఎల్.వెంకట్రావు, ఉప్పల భాస్కరరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో..

మహారాణిపేట: ఎప్పుడూ రోగుల సేవలో నిమగ్నమై ఉండే కేజీహెచ్ వైద్యులు, నర్సులు సంక్రాంతిని పురస్కరించుకుని సందడి చేశారు. శనివారం నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 14 విభాగాలకు చెందిన హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు పాల్గొని ముగ్గులు వేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్, ఉద్యోగులు, సిబ్బంది ముగ్గులను పరిశీలించారు. న్యాయ నిర్ణేతలుగా డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ వాసవీలత, డాక్టర్ వాణి, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పనా మాళి వ్యవహరించారు. విజేతలుగా నిలిచిన వారి పేర్లను డీసీఎస్ ఆర్ ఎంవో డాక్టర్ మెహర్ ప్రకటించారు. నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు భవానీ, వరలక్ష్మి, సీనియర్ హెడ్ నర్సులు పిట్ట వరలక్ష్మి, డి.లక్ష్మి, ప్రశాంతి, సీనియర్ స్టాఫ్‌నర్స్‌లు తదితరులు పాల్గొన్నారు.

బాలిక ఆచూకీ తెలపాలని ఆందోళన



కళ్లకు నల్లరిబ్బన్లతో నిరసన తెలుపుతున్న బాలిక కుటుంబ సభ్యులు

సీతమ్మధార: నిరుపేద కుటుంబానికి చెందిన బాలిక (16) డిసెంబర్ 19న అదృశ్యమైంది. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో జాప్యం జరగడంతో వారు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కలిసి మరోసారి ఫిర్యాదు చేయడంతో ఫిర్యాదును నాలుగో పట్టణ పోలీసులకు బదిలీ చేసి దర్యాప్తు వేగవంతం చేయమని చెప్పారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు హైదరాబాద్‌లో బాలిక మిత్రులు ఉన్నారని అనుమానిస్తూ విశాఖ నుంచి హైదరాబాద్‌కు బాలిక తల్లిదండ్రులను తీసుకెళ్లారు. ఇందుకు బాలిక తల్లిదండ్రులు రూ. 6 వేలు అప్పు చేసి వెళ్లారు. అయితే బాలిక ఆచూకీ లభ్యం కాక నిరాశతో వెనుదిరిగారు. కొన్ని రోజుల తర్వాత రాజమండ్రిలో బాలిక ఆచూకీ లభ్యమైందని అక్కడికి వెళ్లాలని పోలీసులు బాలిక తల్లిదండ్రులకు చెప్పారు. అయితే అక్కడికి వెళ్లేందుకు తమ వద్ద డబ్బు లేదని వారు తెలపడంతో పోలీసులు తలలు పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో తమ కుమార్తె ఆచూకీ వెంటనే కనుగొనాలని బాలిక తల్లి జి. పార్వతి కోరుతూ జీవీఎంసీ గాంధీ పార్కులో కుటుంబ సభ్యులతో కలిసి నోటికి నల్లరిబ్బన్లు ధరించి శనివారం నిరసన తెలిపారు. సీపీ ఆదేశాలతో అయినా పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి తమ కుమార్తె ఆచూకీ కనుగొనాలని కోరారు. తాము తాటిచెట్లపాలెం లెప్రసీ కాలనీలో నివాసం ఉంటున్నామని తెలిపారు. అమాయకమైన ఆడపిల్లలను మాయతో మోసం చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని బాలిక కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. నిరసనలో పార్వతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్‌కు సంక్రాంతి శోభ

- దుస్తుల కొనుగోలుకు పోటీ పడుతున్న జనం
- ట్రాఫిక్‌తో రద్దీగా మారిన రహదారులు



పోలీస్ బ్యారక్స్ వద్ద దుస్తులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



పూర్ణామార్కెట్ వద్ద జనసంచారం



చెప్పుల దుకాణాల వద్ద జనం

జగదాంబ: పూర్ణామార్కెట్ సంక్రాంతి శోభ సంతరించుకుంది. భోగి, సంక్రాంతి, కనుమ పండగల నేపథ్యంలో మార్కెట్ జన సంచారంతో నిండిపోయింది. వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. జగదాంబ నుంచి పూర్ణామార్కెట్ వరకు దుకాణాలు జనాలతో కళకళలాడుతున్నాయి. ఈ పరిసర ప్రాంతాలు వాహనాలు, జనాలతో ఖాళీ లేకుండా ఉన్నాయి. కొత్త బట్టల కొనుగోలుకు జగదాంబ జంక్షన్, పందువుల్లల సందు, టర్నర్‌చౌల్ట్రీ, పోలీస్ బ్యారక్స్ వద్ద ఇసుకవేస్తే రాలనంతగా జనం ఉన్నారు. పిండి వంటల నిమిత్తం సరకుల కోసం వచ్చిన వారు పూర్ణామార్కెట్, స్ప్రింగ్‌రోడ్డు, నూనెమిల్లువీధికి పెద్ద ఎత్తున చేరుకోవడంతో రోడ్లు రద్దీగా మారాయి. ఫ్యాన్సీ వస్తువులకు ప్రసాద్‌గార్డెన్స్ వీధులు పోటెత్తాయి. ట్రాఫిక్ పోలీసులు ఎక్కడికక్కడ సిబ్బందితో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు.